ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 13 మార్చి 2024


శంభీపూర్ రాజు




కాసాని జ్ఞానేశ్వర్

కొలిక్కి వచ్చిన కసరత్తు!

రెండు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు?

- చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్.. మల్కాజిగిరి నుంచి శంభీపూర్ రాజు!
- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతులెత్తేయడంతో మారిన సమీకరణలు
- మొన్నటి దాకా టికెట్ కోసం పోటీ..
- ప్రస్తుతం అభ్యర్థులే కరువైన దైన్యంలో బీఆర్ఎస్..

ఎట్టకేలకు చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లో తమ అభ్యర్థులను బీఆర్ఎస్ ఖరారు చేసింది. చేవెళ్ల నుంచి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, మల్కాజిగిరి నుంచి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బరిలో దించాలని గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు దీనిపై పార్టీ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే అధికార కాంగ్రెస్, బీజేపీల్లో టికెట్ల కోసం నేతలు పోటీపడుతుంటే మొన్నటి దాకా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్‌లు సైతం వెనకడుగు వేసే పరిస్థితి వచ్చింది. దీంతో సోమ, మంగళవారాల్లో పార్టీ నేతలు విస్తృతంగా చర్చించి పోటీకి బరిలో నిలిపేందుకు జ్ఞానేశ్వర్, రాజుల పేర్లను ఖరారు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల గాలి వీస్తోందని, బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసినా గెలవలేం అనే భయంతోనే చాలా మంది నేతలు కారు గుర్తుపై పోటీకి జంకుతున్నట్టు సమాచారం!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రెండు లోక్‌సభా స్థానాలకు అభ్యర్థులను దాదాపు ఖరారు చేసింది. కీలకమైన ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ఖరారుకు కొన్నాళ్లుగా కసరత్తు చేస్తున్న బీఆర్ఎస్‌కు అభ్యర్థుల ఎంపిక పెద్ద సవాల్‌గా మారిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్‌లో చాలా మంది సీనియర్లే ఉన్నా చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల నుంచి పోటీకి వారిలో ఎక్కువ మంది నేతలు ఆసక్తి చూపడంలేదు. చివరకు పార్టీ అధిష్ఠానం ఈ రెండు స్థానాల అభ్యర్థులపై తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సోమ, మంగళవారాలు వరుసగా రెండు రోజులు జరిగిన సమావేశాల్లో పార్టీ అధినాయకత్వం చేవెళ్ల, మల్కాజిగిరి అభ్యర్థుల ఎంపికపై ఓ నిర్ణయానికొచ్చినట్టు తెలుస్తోంది. చేవెళ్ల అభ్యర్థిగా జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, మల్కాజిగిరి అభ్యర్థిగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేర్లు దాదాపు ఖరారయ్యాయి. అయితే వీరిని పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. వాస్తవానికి ఈ రెండు లోక్‌సభా స్థానాల పరిధిలో గల అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీగానే ఓట్లు లభించాయి. అయితే ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా పూర్తిగా మారిపోయాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జడ్పీ చైర్‌పర్సన్లు కాంగ్రెస్ గూటికి చేరారు. అలాగే పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా హస్తం పార్టీలో చేరుతున్నారు. క్షేత్రస్థాయిల్లో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఓటమి భయంతో పార్లమెంట్ స్థానాల నుంచి బరిలో దిగేందుకు సీనియర్ నేతలు సైతం వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల ఎంపిక బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారింది. బీఆర్ఎస్ నుంచి బరిలో దిగేందుకు సీనియర్లు ఆసక్తిచూపకపోవడంతో ఇటీవల ఓడిన కాంగ్రెస్ నేతలకు సైతం బీఆర్ఎస్ ముఖ్యనేతలు ఫోన్‌చేసి మీకు అవకాశం కల్పిస్తామని, కారు పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. అయితే ఎవరూ కూడా ఇందుకు ఆసక్తిచూపలేదు.

అసెంబ్లీ ఫలితాలతో పరిస్థితులు తలకిందులు!

ఇదిలా ఉంటే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వరకూ ఈ రెండు లోక్‌సభ స్థానాల నుంచి కారు గుర్తుపై పోటీచేసేందుకు అనేక మంది నేతలు క్యూకట్టారు. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం పోటీకి నిరాకరించడంతో బీఆర్ఎస్ నాయకత్వం అవాక్కైంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే రంజిత్‌రెడ్డి పోటీకి దూరం కావడం పార్టీ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలను ఆయన శాసించారు. కొన్ని విషయాల్లో అప్పటి మంత్రి సబితారెడ్డి కంటే పార్టీలో ఆయనకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఈ విషయంలో కొందరు పార్టీ ముఖ్యనేతల నుంచి అభ్యంతరాలు సైతం వ్యక్తమయ్యాయి. అయితే ఈ విషయంలో కేటీఆర్ కూడా రంజిత్‌రెడ్డి వైపే ఉండడంతో సబితారెడ్డితో పాటు మరికొందరు నేతలు మౌనంగానే ఉండేవారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలను రంజిత్‌రెడ్డికి అప్పగించారు. తాండూరు, వికారాబాద్, పరిగిల్లో పార్టీ ఓటమి పాలైంది. చేవెళ్లలో మాత్రం స్వల్పతేడాతో బయటపడింది. ఈ నేపథ్యంలో చేవెళ్ల లోక్‌సభ స్థానంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో చివరి క్షణంలో చేవెళ్ల బాధ్యతలను చూసుకోవాలని ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డికి చెప్పారు. ఆయన రంగంలో దిగడంతో అక్కడ పరిస్థితులు కొంత మారాయి. కారణాలేవైనా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత రంజిత్‌రెడ్డి పార్టీకి కొంత దూరం పాటిస్తూ వస్తున్నారు. కొన్ని రోజుల కింద బీఆర్ఎస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిని తానే అని ప్రకటించిన ఆయన ఇపుడు మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా పోటీకి ఆసక్తిచూపడం లేదు. అంతేకాక ఆయన కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నట్లుగానూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకత్వం అభ్యర్థి ఎంపికకు కసరత్తు మొదలుపెట్టింది. అనేక మంది సీనియర్లు ఇపుడున్న రాజకీయ పరిస్థితులు కారణంగా పోటీకి ఆసక్తి చూపలేదు. దీంతో చివరకు ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి పేర్లను పరిశీలించింది. అయితే సబితారెడ్డి కుటుంబం టికెట్ విషయం ముందుగా చెప్పి ఉంటే బరిలో దిగే వారం అని, ఇపుడు తక్కువ సమయం ఉండడంతో పోటీచేయడం కష్టం అని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీంతో కాసాని జ్ఞానేశ్వర్ లేదా ఆయన తనయుడు వీరేష్‌లలో ఒకరిని పోటీ చేయాలని పార్టీ కోరింది. చివరకు మంగళవారం జరిగిన సమావేశంలో కాసాని జ్ఞానేశ్వర్ పేరు ఖరారు చేసినట్లు తెలిసింది. జ్ఞానేశ్వర్ ఎంపికలో సబితారెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం.

మల్కాజిగిరిలో ఉద్యమ నాయకుడికి అవకాశం

ఇక మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలోనూ మాజీ మంత్రి మల్లారెడ్డి తన కుమారుడి కోసం ముందుగానే ఖర్చీఫ్ వేసుకున్నారు. కానీ ఆయన ఇపుడు ఉన్న పరిస్థితుల్లో పోటీ చేయలేనని చేతులెత్తేశారు. మొన్నటి ఎన్నికలదాకా మేడ్చల్ జిల్లాకు అంతా తానే అన్నట్టుగా వ్యవహరించిన మల్లారెడ్డి చివరకు తమ కుటుంబ సభ్యులెవరూ పోటీచేయడం లేదని ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకత్వం షాక్‌కు గురైంది. ఇటీవల మల్లారెడ్డి అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కాలేజీలో అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చివేసిన సంగతి తెలిసిందే. దీని తరువాత మల్లారెడ్డి కాంగ్రెస్‌కు దగ్గరయ్యే యత్నం చేశారు. అంతేకాక వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయడం లేదని ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ మళ్లీ అభ్యర్థి కోసం వేట మొదలుపెట్టింది. చివరకు కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బరిలో దింపాలని నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచీ కేసీఆర్ కుటుంబం వెన్నంటి ఉండడంతో ఈ సారి ఆయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించారు.

మహేశ్వరాన్ని కాంగ్రెస్‌కు కంచుకోటగా మారుద్దాం!

- నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ ఖాయం
- ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా చేవెళ్ల ఎంపీ స్థానంలో గెలిచేది కాంగ్రెస్సే
- జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం, మార్చి 12 : మహేశ్వరం నియోజకవర్గాన్ని కాంగ్రెస్‌కు కంచుకోటగా మార్చుదామని, అందు కోసం ఇక్కడ బీఆర్ఎస్‌ను ఖాళీచేసి కాంగ్రెస్‌కు పైచేయి వచ్చేలా ప్రతీ కార్యకర్త, నాయకులు కృషిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో తాను పాలుపంచుకుంటానని, వారికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు. మంగళవారం పెండ్యాలలో కాంగ్రెస్ నాయకులతో ఆమె సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంలో కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ మరవదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి జిల్లాను, ప్రత్యేకంగా మహేశ్వరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామంలో ఏమైనా అసంపూర్తి పనులుంటే వాటిని తన దృష్టికి తెస్తే అధికారులతో మాట్లాడి పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని, ప్రభుత్వ పథకాలు అర్హులకు వర్తింపజేయడంలో ఈ కమిటీలు కీలకం కానున్నాయన్నారు. అయితే దీనిపై పార్టీ నాయకులు, ప్రభుత్వం తగిన ప్రణాళికలు రచిస్తోందని అనితారెడ్డి తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల సీటులో కాంగ్రెస్ విజయం తథ్యం అని, పార్టీ అభ్యర్థి ఎవరైనాసరే పార్టీ గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జె.హన్మంతరెడ్డి, మంత్రి బాల్‌రాజ్, జగన్‌మోహన్‌రెడ్డి, అంజయ్య, నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, విజయ్, అనిల్, రాజయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


పెండ్యాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి



మూత్రశాల, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

బస్టాండ్‌లో వసతుల కల్పన

- యాచారంలో ప్రయాణికుల కోసం తాగునీటి సౌకర్యం
- టాయ్‌లెట్లకు మరమ్మతులు


బస్టాండ్‌లో అధికారులు తవ్వించిన తాగునీటి సంపు

యాచారం, మార్చి 12 : యాచారం బస్టాండ్‌లో వసతులు లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'బస్టాండ్‌లో వసతులు కరువు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. అప్పట్లోనే హయత్‌నగర్ డీవీఎం సుచరిత, ఇబ్రహీంపట్నం డీఎం వెంకటనర్సప్పలు ప్రయాణికులతో మాట్లాడి బస్టాండ్‌లో నెలకొన్న ఇబ్బందులపై తెలుసుకున్నారు. త్వరలోనే వసతులు కల్పిస్తామని నెల రోజుల క్రితం హామీ ఇచ్చారు. ఈ మేరకు బస్టాండ్ ఆవరణలో తాగునీటి సంపును నిర్మించారు. నిత్యం మిషన్ భగీరథ నీటిని సంపులో నింపి ప్రయాణికుల కోసం నల్లాను ఏర్పాటు చేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. మూడురోజుల్లో పనులు పూర్తి చేసేందుకు అధికారులు పనులను ముమ్మరంగా చేయిస్తున్నారు.

మూడు నెలలక్రితం బస్టాండ్‌లో టాయ్‌లెట్ల దుస్థితి




పనులను ప్రారంభిస్తున్న జంగారెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

కందుకూరు, మార్చి 12 : దశల వారీగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి అన్నారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనుల నిమిత్తం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.33 లక్షల నిధులతో చేపట్టిన పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 35గ్రామ పంచాయతీల్లో ఐదేళ్లుగా రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ రేఖ, నాయకులు సామయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కొత్త మార్గాన్ని కనిపెట్టిన బీజేపీ

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్ వెస్లీ

యాచారం, మార్చి 12 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవినీతికి కొత్తమార్గాన్ని కనిపెట్టిందని, బ్యాంక్‌లు ప్రధాని నరేంద్ర మోదీకి జేబు సంస్థలుగా మారాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్ వెస్లీ విమర్శించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును కూడా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. మంగళవారం మేడిపల్లిలో సీపీఎం స్టడీ సర్కిల్ సమావేశంలో వెస్లీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ లెక్కల మేరకు 30 విడతల్లో 28వేల ఎన్నికల బాండ్లను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విక్రయించిందని, వాటి విలువ రూ.16వేల కోట్లపైనే ఉంటుందన్నారు. ఈ మొత్తంలో బీజేపీకి చెందినవి రూ.10,122కోట్లు అని, ఇది అవినీతి కాదా? అని ఆయన ప్రశ్నించారు. బాండ్ల రూపంలో పార్టీకి నిధులు ఇచ్చిన వారి వివరాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేంద్రం దేశంలో మతోన్మాద కార్యకలాపాలకు తెరలేపడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ విమర్శించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.యాదయ్య, మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు సామ్యేల్, జగన్, రవికుమార్, కిషన్, సుందర్, నర్సింహ, పి.అంజయ్య, లాజర్, పి.బ్రహ్మయ్య, బుచ్చయ్య, శ్రీకాంత్, దేవదాస్ పాల్గొన్నారు.


మేడిపల్లిలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

అయ్యసాగర్‌లో ఘనంగా రథోత్సవం

ఆమనగల్లు, మార్చి 12 : మండల పరిధి రాంనుంతల గేటు సమీపంలో అయ్యసాగర్ శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి భద్రకాళి, సరస్వతి, ఆంజనేయ ఆలయాల్లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున పెద్ద రథోత్సవాన్ని నిర్వహించారు. రథంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి తాళ్లతో రథాన్ని లాగి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సరితపంతూనాయక్, మాజీ సర్పంచ్ సోనశ్రీనునాయక్, ఆలయ నిర్వాహకులు భట్టు నర్సిరెడ్డి, ఎన్టీ పంచాక్షరి, మల్లప్ప, వైద్యనాథ్, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, వీరయ్య, పంతూనాయక్, ఆనంద్, యాదిలాల్, అరుణ్, చందర్, యాదయ్య పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కడ్తాల్: చరికొండ వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు కొనసాగే ఈ జాతరకు ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, యాచారం,కందుకూరు మండలాల నుంచి భక్తులు రానున్నారు. తొలి రోజు రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి మూల విరాట్లను పట్టువస్త్రాలతో అలంకరించి అర్చకుడు, ఆలయ నిర్వాహకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాలకూర్ల అద్దాల రాములు, నాయకులు నర్సింహాగౌడ్, జంగయ్యగౌడ్, భీష్మాచారి, లక్ష్మయ్య, బల్వంతరెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

కాకునూర్‌లో భక్తిశ్రద్ధలతో శకటోత్సవం



కేశంపేట : మండల పరిధి కాకునూర్‌లో వెలసిన మహాలింగేశ్వర స్వామిబ్రహ్మోత్సవాల్లో మంగళవారం శకటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాకునూర్, సుందరాపురం, లేమామిడి, నిర్దవెల్లి గ్రామాల భక్తులు తమ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ప్రభలను ఏర్పాటుచేసి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. శకటోత్సవాన్ని తిలకించడానికి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింలుగౌడ్, ప్యాక్స్ చైర్మన్ గంధ్ర జగదీశ్వర్ గౌడ్, శేఖర్‌రెడ్డి, రాములు, పర్వతాలు, శ్రీనివాస్, నర్సింహ, జయమ్మ, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం, మల్లేష్, భీమయ్య, లింగం, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, నాగిరెడ్డి, రవీందర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, పూజారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

18న శిక్షణ శిబిరంలోని పాత వస్తువుల వేలం



ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మార్చి 12: ఈనెల 18వ తేదీన వికారాబాద్ జిల్లాలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో పనికిరాని, పాత, చెడిపోయిన, సర్వీస్ అయిపోయిన వస్తువులను పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనాలనుకొనేవారు ఈనెల 18న ఉదయం 10.30 గంటలకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. ఏదైనా సమాచారం కొరకు సంప్రదించడానికి జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి సెల్‌నెంబర్ 8712670012కు గానీ లేదా డీఎస్పీ ఏఆర్ వీరేశం సెల్ నెంబర్ 8712670019కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదా ఆర్ఐ అంజాత్ పాషా సెల్‌నెంబర్ 8712670028కు గాని సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

రైతు రుణమాఫీని అమలు చేయాలి

నవాబుపేట, మార్చి 12: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు లక్షల రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని పీఏసీఎస్ డైరెక్టర్ మానెయ్య అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు.

వేలం వాయిదా



వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఈవో

కులకచర్ల, మార్చి 12: బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో నిర్వహించిన కొబ్బరికాయల విక్రయానికి వేలం వాయిదాపడింది. సరైన పాట రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు దేవాలయ ఈవో సుధాకర్ తెలిపారు. ఇట్టి వేలాన్ని ఈనెల 18న మరోసారి నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ నర్సమ్మ రాములు, పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు, కార్య నిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డికి కాంగ్రెస్ నాయకుల సన్మానం

షాబాద్, మార్చి 12 : షాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా కాంతారెడ్డి బాధ్యతలు చేపట్టడంతో చేవెళ్ల నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చల్లా సంతోష్ రెడ్డి, షాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంగలి చెన్నయ్య, బాలకృష్ణారెడ్డి, నవీన్‌లు సన్మానించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన్ను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట

● రీజియన్‌లో అత్యుత్తమ క్లబ్‌గా ఎంపిక



అవార్డులు అందుకుంటున్న లయన్స్‌క్లబ్ బృందం

ఆమనగల్లు, మార్చి 12 : సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట పండింది. రీజియన్‌లో అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికైంది. లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశం మంగళవారం హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. రీజియన్ చైర్మన్ సాదు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రీజియన్ పరిధిలోని వివిధ క్లబ్‌ల సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొరివి వెంకటయ్య, పీఆర్‌వో ఎంఏ పాషాలకు రీజియన్ స్థాయిలో అవార్డులు అందించారు. అదేవిధంగా శాశ్వత ప్రాజెక్ట్‌ల నిర్మాణం, మెగా వైద్యశిబిరాల నిర్వహణ, రక్తదాన, నేత్ర వైద్యం, అన్నప్రసాదం ఈవెంట్స్‌కు మొత్తం పది అవార్డులు లభించాయి. రీజియన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆయా అవార్డులను క్లబ్ సభ్యులకు ప్రదానం చేశారు. గ్రామీణ క్లబ్‌లలో రాష్ట్రస్థాయిలో ఆమనగల్లు క్లబ్ అగ్రభాగాన నిలవడం అభినందనీయమని ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ సందడి నరేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ బటాడ్, వైస్ గవర్నర్ మహేందర్ కుమార్ రెడ్డి, ఎల్ఐసీఐ మల్టిపుల్ కో-ఆర్డినేటర్ చెన్నకిషన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ గవర్నర్ జూలూరి రమేశ్, రఘు లు అన్నారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు గౌడ్, గోవర్ధన్ రెడ్డి, కండె ఓంకారం, మిట్టపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయం

ఆమనగల్లు, మార్చి 12: గ్రామాల సమగ్రాభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, వెల్దండ మండలాల పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు, పలు సమస్యల పరిష్కారంపై ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. 2వ విడత గొర్రెల యూనిట్లు త్వరగా అందేలా ప్రభుత్వ పరంగా చొరవ తీసుకోవాలని కసిరెడ్డికి ఫిరోజ్ నగర్, నాగిళ్ల గ్రామాల గొర్రెల పెంపకందారులు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని నారాయణరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో అమలు చేసిందని చెప్పారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నారాయణ రెడ్డి సూచించారు. కార్యక్రమాల్లో నాయకులు గోపాల్ రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు గోపాలస్వామి ఆలయం ముస్తాబు

● 18 నుంచి ప్రారంభం.. 6 రోజులపాటు జాతర

● భక్తులకు విశాల వసతుల ఏర్పాటు



జాతరకు ముస్తాబైన ఆలయం; కొలువుదీరిన స్వామివారి మూలవిరాట్(ఇన్‌సెట్లో)

తలకొండపల్లి, మార్చి 12 : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కల్కిదోన గుట్టపై వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మార్చి 18 నుంచి 23 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం కల్కిదోన గుట్టపై నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, కేశంపేట, మిడ్జిల్, మాడ్గుల, వెల్దండ తదితర మండలాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో ఇప్పటికే తగిన ఏర్పాట్లు గావించారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఫౌండర్‌ట్రస్టీ సిద్దాంతి పట్టాభిరామ శర్మ, అర్చకుడు కృష్ణమూర్తిలు వివరించారు. మార్చి 18న గణపతి పూజ, పుణ్యహావాచనం, అంకురార్పన, ఉదయం 11:30 గంటలకు గోపాలస్వామి కల్యాణోత్సవం, 19న గరుడసేవ, 20న చిన్న రథం, 21న పెద్ద రథోత్సవం, భజనలు, 22న గజవాహన సేవ, దీపోత్సవం, 23న చక్రతీర్థం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని పట్టాభి రామశర్మ, కృష్ణమూర్తి తెలిపారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలతలు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులకు మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం అందజేశారు. కాగా, బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాసు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సత్యం, జంగయ్య, లక్ష్మయ్య, యాదయ్య, శంకర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

'ధరణి'తో రైతులకు కష్టాలు తెచ్చింది బీఆర్ఎస్సే



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

కందుకూరు, మార్చి 12 : ధరణి పోర్టల్‌తో రైతులకు కష్టాలు తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఏడేళ్లుగా రైతుల భూములకు సంబంధించి రికార్డుల్లో వారి పేర్లు నమోదు చేయకుండా కాలయాపన చేశారని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నాయకులు అందుగుల సత్యనారాయణతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017కు ముందు రైతులు రికార్డుల్లో పేర్లు మార్పించడానికి తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లేవారని, బీఆర్ఎస్ అధికారం చేపట్టాక ధరణి పోర్టల్ వల్ల కలెక్టర్ లేదా సీసీఎల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని గుర్తుచేశారు. అలాంటి ఇబ్బందులు కలుగకుండా సీఎం రేవంత్‌రెడ్డి ధరణి స్పెషల్‌డ్రైవ్‌ను చేపట్టినట్లు చెప్పారు. కాగా, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డిలు తమ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పదేళ్ల కాలంలో భూ సమస్యలపై 2లక్షల30వేల దరఖాస్తులు వచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పరిష్కరించలేదన్నారు. దళితుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూసిందని, తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి వ్యత్యాసం లేకుండా పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు దొందూదొందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, చంచు గణేష్, ఎస్.వెంకటేష్‌గౌడ్, జగదీష్ కురుమ, జి.సురేందర్ రెడ్డి, గణేష్‌నాయక్, వెంకటేష్, శ్రీశైలం, నర్సింహ, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మతం కంటే మానవత్వం మిన్న : కసిరెడ్డి



ఆమనగల్లు : ఇఫ్తార్ విందులో నారాయణరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్, మార్చి 12 : సర్వ మానవాళి శ్రేయస్సే అల్లా ధ్యేయమని, కులం, మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మసీద్‌లలో మంగళవారం రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు అబ్దుల్‌జబ్బార్ నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. తొలి రోజు ఉప వాస దీక్ష విరమించినవారికి పండ్లు అందజేశారు. ఎమ్మెల్యేను ఖాదర్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. మజీద్ అధ్యక్షులు మహ్మద్ మాసూమ్, ఖాదర్ ఖాద్రీ, గౌస్ మైనోద్దీన్, నాయకులు సయ్యద్ ఖలీల్, అబ్దుల్ రహీమ్, కరీం, మహబూబ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అనితవిజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, మానయ్య, నాయకులున్నారు. కడ్తాల మండల కేంద్రంలోని మసీద్‌లలో ప్రార్థనలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మజీద్ లలో ఆత్మీయ సమ్మిళిత సమ్మేళనం నిర్వహించారు. మౌలిసాబ్, అబ్దుల్ రాహూఫ్, జానిమీయా, జహంగీర్‌బాబా, జహంగీర్‌అలీ, జావేద్, ఈర్షద్, ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

షాద్‌నగర్, మార్చి 12 : పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్ల భవనంలో సమావేశం నిర్వహించారు. తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పెన్షనర్ల పెండింగ్ సమస్యలు, డీఏలు, ఈహెచ్ఎస్‌కు సంబంధించిన బకాయిలను పరిష్కరించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు. ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవో 186 ప్రకారం ఈహెచ్ఎస్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. వివిధ జిల్లాలకు చెందిన పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, శంకర్‌రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 12 : రాష్ట్రంలో మున్నూరు కాపులను ఆదుకునేందుకుగాను మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, ఎండీఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవికుమార్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై మంగళవారం శంషాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటుపై గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్‌కు వినతిపత్రాలు అందించామన్నారు. రాష్ట్రంలో 24 శాతం మున్నూరుకాపులు ఉన్నప్పటికీ.. సంక్షేమ ఫలాలు అందడంలో తగిన న్యాయం జరగడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కూడా కార్పొరేషన్ ఏర్పాటు అంశం పెట్టలేదన్నారు. 33 జిల్లాల్లో రెండెకరాల విస్తీర్ణంలో కాపులకు భవనాలు కట్టించాలన్నారు. ఇందుకు రూ.20కోట్లు కేటాయించాలని వారు ముఖ్యమంత్రి రేవంత్‌ను కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.బాలకృష్ణ, ఎం.అశోక్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మీనివాస్

టీఎస్ఎస్‌వో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్

మాడ్గుల, మార్చి 12 : తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కలకొండ లక్ష్మణ్‌ను నియమించారు. ఈమేరకు మంగళవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు నియామకపత్రాన్ని లక్ష్మీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి టీఎస్ఎస్‌వో సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. ఈసందర్భంగా లక్ష్మీనివాస్‌కు లక్ష్మణ్ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన్, శేఖర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

● ట్రాలీ ఆటో బోల్తాపడి ఒకరు మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్, మార్చి 12: షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిషన్‌నగర్ శివారులో మంగళవారం సాయంత్రం ట్రాలీ ఆటో బోల్తా పడటంతో ఒకరు మృతిచెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపిన వివరాల ప్రకారం.. చటాన్‌పల్లికి చెందిన కొందరు కిషన్‌నగర్‌లో బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో కిషన్‌నగర్ శివారులో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి సడెన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న నర్సింహ(35) అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి.. అనంతరం ఉస్మానియాకు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రిటైర్డ్ ఉద్యోగి..

కొత్తూర్, మార్చి 12: మండల కేంద్రానికి సమీపంలో నాట్కో జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్షపతి(67) అనే రిటైర్డ్ ఉద్యోగి మృతిచెందినట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. శంషాబాద్ మండలం రాళ్లగూడకు చెందిన భిక్షపతి డీఆర్‌డీఎల్‌లో ఉద్యోగి అని పేర్కొన్నారు. రామేశ్వరం దేవాలయానికి దర్శనం కోసం వచ్చిన భిక్షపతి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

లూనా అదుపుతప్పి చెట్టుకు ఢీకొని మరొకరు..

చేవెళ్ల, మార్చి 12 : లూనా అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మర్రి చెట్టుకు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ స్టేజీ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీస్‌లు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కందవాడ గ్రామానికి చెందిన కవాలి యాదయ్య(56) మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఉన్న విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో పదిహేనేళ్లుగా వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే పని ముగించుకుని ఇంటికి వెళ్లకుండా పని నిమిత్తం చేవెళ్ల మండల కేంద్రానికి లూనాపై వస్తున్నాడు. మార్గమధ్యలోని మల్కాపూర్-కేసారం గ్రామాల స్టేజీల మధ్యలోకి రాగానే లూనా అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న మర్రిచెట్టుకు బలంగా ఢీకొంది. దాంతో తీవ్రగాయాలు కావడంబతో యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు పోలీస్‌లు మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాసుప్రతికి తరలించారు. మృతుడికి భార్య పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కిందపడి కూలీ..

మొయినాబాద్, మార్చి 12 : నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై నుంచి కిందపడి ఓ కూలి మృతిచెందాడు ఈ ఘటన మండల పరిధిలోని చిన్న మంగళారం గ్రామంలో మంగళవారం జరిగింది. పెద్దమంగళారం గ్రామానికి చెందిన వడ్డె మల్లేష్(30) కొన్నాళ్లుగా తన అత్తగారి ఊరైన చిన్నమంగళారంలో ఉంటూ కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్నమంగళారంలో బిజిలి ఎల్లేష్ అనే వ్యక్తి నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. మంగళవారం ఎల్లేష్ కూలి పనికి వెళ్లాడు. రెండో అంతస్తులో పనిచేస్తుండగా జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, అధికారుల నిర్లక్ష్యం మూలంగానే కూలి మృతిచెందాడని గ్రామస్తులు ఆరోపించారు. నిబంధనల ప్రకారం బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు లేవని తెలిపారు. పంచాయతీ అధికారుల పట్టించుకోక పోవడం తోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

డీసీఎం-బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

షాద్‌నగర్ రూరల్, మార్చి 12: డీసీఎం, బైక్ ఢీకొన్న ఘటనలో.. బైక్‌పై వెళుతున్న ఇద్దరికి గాయాలయ్యాయి. షాద్‌నగర్ పట్టణంలోని కోర్టు సముదాయం ఎదుట జరిగిన ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం బైక్‌పై ఓ మహిళ, మరో వ్యక్తితో కలిసి షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో వారు కోర్టు సముదాయం వద్దకు రాగానే.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వస్తున్న డీసీఎం డ్రైవర్ నాగులపల్లి వైపు యూటర్న్ తీసుకున్నాడు. ఈక్రమంలో డీసీఎం బైక్‌ను బలంగా ఢీకొంది. దాంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా సమాచారం అందలేదని తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న ఎడ్లు స్వాధీనం

చేవెళ్ల, మార్చి 12 : ఎడ్లను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం చేవెళ్లలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకొని పోలీస్‌లకు అప్పగించారు. ఈమేరకు ఏడు ఎడ్లను తరలిస్తున్న లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పశువుల లారీని కోకాపేట్‌లోని శ్రీ కృష్ణగోశాలకు పోలీస్‌లు తరలించారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ జిల్లా నాయకుడు చేగూరి భోజిరెడ్డి, జిల్లా ధర్మప్రచారక్ చిల్కూర్ శ్రీనివాస్‌లు, భజరంగ్‌దళ్ నాయకులు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డికి అక్రమంగా జీవాలను కబేళాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నిత్యం అర్ధరాత్రి గోవులను ఒకటిపై ఒకటివేసి కంటైనర్లలో కుక్కి కబేళాలకు తీసుకెళ్తున్నారని, పోలీస్‌లు బాధ్యులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. చేవెళ్లలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా నాయకులు సురేందర్, సాయిరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేశ్, తదితరులు ఉన్నారు.


పేకాట స్థావరంపై ఎస్వోటీ దాడులు

● 9మంది అరెస్టు ● 10 సెల్‌ఫోన్లు, 77,110 నగదు స్వాధీనం

యాచారం, మార్చి 12 : పేకాట ఆడుతున్న 9 మందిని ఎస్వోటీ పోలీసులు అరెస్టుచేసిన ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఓ వ్యవసాయ క్షేత్రంలో చోటుచేసుకుంది. యాచారం మండల కేంద్రానికి సమీపంలో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు రాచకొండ కమిషనరేట్‌కు చెందిన ఎస్వోటీకి పక్కా సమాచారమందింది. దాంతో వారు స్థావరంపై దాడి చేసి 9మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని 10సెల్‌ఫోన్లు, 77,110నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకర్‌కుమార్, ఎస్సై గోపాల్‌లు చెప్పారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

● గుడికి వెళ్తున్నానని చెప్పి వివాహిత..



అనూష

ఆదిభట్ల, మార్చి 12 : వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. గుడికి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన వివాహిత మహిళ అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పంకజ్‌కుమార్ అనే వ్యక్తి భార్య అనూషతో కలిసి బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటూ సీసీ కెమెరాలు బిగించే పనిచేస్తున్నాడు. అనూష ఐదు వారాలుగా ప్రతీ సోమవారం నల్గొండ జిల్లా నార్కట్‌పల్లిలోని చెర్వుగట్టు దేవాలయానికి వెళ్తోంది. ఈక్రమంలో సోమవారం ఉదయం చెర్వుగట్టుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి సాయంత్రం వరకూ తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ దొరకలేదు. అయితే, ఆమె 93470 63425 నెంబర్‌తో రోజూ ఫోన్ మాట్లాడుతుండేదని.. ఆ నెంబర్ ఎవరిదో తెలియదని, ఆ వ్యక్తిపై అనుమానముందని భర్త ఫిర్యాదు చేశాడు.

ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిన బాలిక..

ఇంట్లోవారికి చెప్పకుండా బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రమావత్ చందు భార్య ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూరు గేటు సమీపంలో నివాసముంటూ కూలి పనులు చేస్తుంటాడు. ఈక్రమంలో నవీన్ అనే బాలుడు పెద్ద కుమార్తెతో తరచూ మాట్లాడుతూ ఇబ్బంది పెడుతున్నాడని తెలిసి మందలించాడు. అతనిలో మార్పు రాకపోవడంతో బొంగ్లూరు పరిధిలోని మెట్రోసిటీలో అద్దె ఇంటికి మారాడు. సోమవారం ఉదయం 6గంటలకు ఇంట్లోంచి వెళ్లిన బాలిక సాయంత్రం వరకూ తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోయింది. తండ్రి చందు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆక్రమణకు గురైన చెరువుల సర్వే షురూ!

● తొలుత వంద ఎకరాలకు పైగా ఉన్న ఆయకట్టు ఉన్న చెరువుల సర్వే..

● ఆక్రమణలు గుర్తించి తొలగించేందుకు రంగం సిద్ధం?

హయత్‌నగర్, మార్చి 12 : ఆక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంది. గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు ఆక్రమణకు గురయ్యాయని గుర్తించిన ప్రభుత్వం.. చెరువుల సర్వేకు రంగం సిద్ధం చేసింది. గత బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశమై సర్వేకు ఆదేశించారు. ప్రధానంగా 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులను సర్వే చేయాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను మరోసారి పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఒకవేళ చెరువు ప్రాంతం ఆక్రమణలో ఉంటే దానిని రికార్డుల నుంచి ఎలా తీసివేయాలి? అనే విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ శాఖ పరిధిలో సుమారు 314 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు, కత్వలు ఉన్నట్లు సమాచారం. ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 163 చిన్న, పెద్ద చెరువులు, కత్వలు, చెక్ డ్యాంలు ఉండగా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 151 చిన్న, పెద్దచెరువులు, కత్వలు, చెక్‌డ్యాంలు ఉన్నాయి. కాగా, కలెక్టర్ ఆదేశం మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి నేతృత్వంలో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు సర్వే పనులు ప్రారంభించారు. అలాగే ఇబ్రహీంపట్నం చెరువు తరువాత అతిపెద్ద చెరువైన తుర్కయంజాల్ మాసబ్ చెరువు సుమారు 320.20 ఎకరాల్లో విస్తరించి ఉంది. మంగళవారం అధికారులు జరిపిన సర్వేలో పెద్ద ఎత్తున ఆక్రమణలను గుర్తించినట్లు తెలిసింది. ఈమేరకు చెరువుకు ఉత్తరం వైపున కొంత మంది చెరువును పూడ్చి రోడ్డును వేసినట్లు, చెరువుకు దక్షిణం, పడమటి భాగంలో రియల్టర్లు ఎఫ్‌టీఎల్ ఏరియాలో వెంచర్లు చేసినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది.

సోలార్ రూఫ్‌టాప్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 12: ప్రతీ ఇంటికి సోలార్ రూఫ్‌టాప్ సిస్టంను ఏర్పాటు చేసుకుంటూ విద్యుత్ బిల్లును తగ్గించుకునేందుకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్మార్ట్‌గ్రిడ్ ఆవిష్కరణ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దైనందిన జీవితంలో ఇంధన ఆదా ప్రాముఖ్యత ఎంతగానో ఉందని, దీనికి కేంద్ర ప్రభుత్వం తగు సహకారం అందిస్తుందని ఆయన న్నారు. ఎన్ఐటీ (వరంగల్) ప్రొఫెసర్ డా.ఎస్.వి.శ్రీకాంత్, డా.ప్రదీప్ కుమార్, గురునానక్ విద్యాసంస్థల ఎండీ డా.హెచ్.ఎస్ సైనీ, డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారథి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.బలరామకృష్ణారావు, ఆర్‌అండ్‌డీ డీన్ డా.ఎస్.వి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.





సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తదితరులు.. మాట్లాడుతున్న జీఎస్ కోహ్లీ

మత్స్య సహకార సంఘం గ్రామ కమిటీ



నియామకపత్రం అందజేస్తున్న అధికారి ఓంప్రకాష్

షాబాద్, మార్చి 12 : మత్స్య సహకార సంఘం ముద్దెంగూడ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం షాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో రాష్ట్ర సహకార సంఘం ఎన్నికల అధికారి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మత్స్యసహకార సంఘం గ్రామాధ్యక్షుడిగా కె.పాండు, గౌరవాధ్యక్షుడిగా ఎన్.మల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఎన్.రవి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీశైలం, కోశాధికారిగా ఎన్.మల్లేష్, డైరెక్టర్లుగా బి.శ్రీశైలం, బి.దయాకర్, పి.రమేష్, కె.ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పాండు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు ఎన్.లింగం, గౌరవాధ్యక్షుడు కె. వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పి.మానయ్య, జిల్లా కార్యదర్శి పి.జంగయ్య, సంఘం నాయకులు పి.నర్సింహులు, యాదగిరి, జనార్ధన్, మానయ్య, పోచయ్య, యాదయ్య, సుధాకర్, సురేష్, రాంచంద్రయ్య, జంగయ్య, శేఖర్, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

● **తలకొండపల్లి** : మండలంలోని దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 31న అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, శతాబ్ది టౌన్ షిప్ ఎండీ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో బాగంగా నిర్వహించే బండలాగుడు పోటీలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లను పరిశీలించారు. రైతు సంబురాలు పేరిట అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక మాజీ సర్పంచ్ శ్రీశైలం తెలిపారు.

● **షాబాద్** : ప్రజాస్వామ్యం, ఓటు విలువలపై అవగాహన పెంచుకోవాలని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాఠశాలలో ప్రజాస్వామ్యం, ఓటు విలువ అనే అంశంపై విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు.

● **కడ్తాల్** : కడ్తాల మండల కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన భవాని రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్ రెడ్డిలు పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన తోడ్పాటునందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

● **ఆమనగల్లు/కొత్తూర్** : ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ పోలింగ్ బూత్ సమ్మేళనానికి ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పాల్గొననున్న నేపథ్యంలో ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు వాహనాల్లో సమ్మేళనానికి తరలివెళ్లారు. నాయకులు అశోక్ గౌడ్, నర్సింహగౌడ్, నాగరాజుచారి, రణధీర్ గౌడ్, తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.